క్లుప్తంగా

వైభవంగా రథోత్సవం


రథం లాగుతున్న భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకం, హోమం నిర్వహించారు. రథం ఎదుట ఆలయ ధర్మకర్త గూడ కృష్ణమాచార్యులు, రాధాకృష్ణశర్మ, అనిల్‌జోషి, జానకిరామయ్య, ఆనందశర్మ, నిహాల్‌జోషిలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథంపై ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేయాలి


నగరిని సన్మానిస్తున్న నాయకులు

మాడ్గుల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గ్యార నర్సింహులు.. మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతూ.. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పేర్కొన్నారు. పార్టీ నాయకులు జింకల భాస్కర్ పాల్గొన్నారు.

వీరాంజనేయ క్షేత్రంలో ఉత్సవాలు షురూ


పూజలు చేస్తున్న భక్తులు

కడ్తాల్: మండల పరిధి అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని శ్రీరామ వీరాంజనేయ క్షేత్రంలో శ్రీ సీతారామ, శ్రీ పరమేశ్వర, శ్రీచక్ర సహితజ్ఞాన సరస్వతుల ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ప్రారంభమైంది. వేద పండితులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, మంటప రాధన, అగ్నిప్రతిష్ట తదితర కార్యక్రమాలను నిర్వహించారు. జ్ఞాన ప్రసూనాశర్మ ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక కుంకుమార్చనలు, పుష్పార్చనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజనలు, గీతాలాపనలతో పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

నూరు శాతం వసూలు చేస్తాం

ఇబ్రహీంపట్నం రూరల్: ఈ నెల 30 లోపు నూరు శాతం ఇంటి పన్ను వసూలు లక్ష్యంగా పని చేయాలని ఎంపీఓ రఘు అన్నారు. ఆదివారం మండల పరిధి నెర్రపల్లి, దండుమైలారం, ముకునూర్, రాయపోల్, ఉప్పరిగూడ గ్రామాల్లో పన్ను వసూలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ.. ఇంటి పన్ను, నల్లా బిల్లులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, నీటి సరఫరా నిమిత్తం పజలందరూ చెల్లించాలని కోరారు. అనంతరం ఇప్పటి వరకు ఎంత మంది పన్ను చెల్లించారని పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. నేటికీ మండలంలో 63 శాతం మాత్రమే పూర్తి చేశారని, నూరు శాతం త్వరలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మానుష్య ప్రాంతాల్లో తిరగొద్దు

ఇబ్రహీంపట్నం రూరల్: నిర్మానుష్య ప్రాంతాల్లో తిరగొద్దని సీఐ జగదీశ్వర్ సూచించారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగార్జున సాగర్ రహదారి నుంచి కొహెడ రోడ్డులో కొంత మంది అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నారని తెలిపారు. గతంలో నిర్మానుష్య ప్రాంతాల్లోకి వెళ్లిన వారి వద్ద నగదు, నగలు అపహరించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రాత్రి పూట ఒంటరిగా తిరిగే వారిని టార్గెట్ చేస్తూ.. దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్నట్లు తెలియవచ్చిందని పేర్కొన్నారు. కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమానితులు సంచరిస్తున్నట్లు తెలిస్తే.. 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. వేసవి కాలంలో రాత్రి పూట ఆరు బయట పడుకునే ముందు జాగ్రత్తలు పాటించాలని, అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

నిరీక్షణకు తెర..

- నిర్మాణ పనులకు మోక్షం
- చురుగ్గా కత్వవాగు వంతెన పనులు
- తీరనున్న గిరిజనుల చిరకాల స్వప్నం


నిర్మాణంలో ఉన్న కత్వవాగుపై వంతెన

ఆమనగల్లు: గిరిజనుల చిరకాల స్వప్నం నెరవేరనుంది. సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న వంతెన నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. పనులు చురుగ్గా కొనసాగుతున్న నేపథ్యంలో త్వరలో వినియోగంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండా నుంచి శంకరకొండతండాకు వెళ్లే మార్గంలోని కత్వవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను మరి కొద్దిరోజుల్లో పూర్తిచేయనున్నామని సంబంధిత అధికారులు పేర్కొనడంతో.. తమ కష్టాలు త్వరలోనే తీరనున్నాయని ఇరు తండాల ప్రజలు భావిస్తున్నారు. వర్షాకాలంలో ఆమనగల్లు చెరువు నిండి అలుగుపారిన సమయంలో రెండు తండాల మధ్య ఉన్న కత్వవాగు ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. ఈ సమయంలో తండా వాసుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుండటంతో.. గిరిజనుల డిమాండ్ మేరకు వాగుపై వంతెన నిర్మాణం అనివార్యం అయింది.

ఆందోళనలతో షురూ

బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో శంకరకొండతండా, మేడిగడ్డతండా గిరిజనులు ఆందోళనలు చేశారు. వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్షలు చేశారు. దీంతో ప్రస్తుత ఎమ్మెల్యే, నాటి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పనులు ప్రారంభించి, త్వరగా పూర్తి చేస్తామని హామీనిచ్చారు.

అప్రోచ్ రోడ్డు..

కసిరెడ్డి ఇచ్చిన హామీ మేరకు పిల్లర్ల దశలో నిలిచిన వంతెన నిర్మాణ పనులు ప్రస్తుతం వేగవంతం అయ్యాయి. దాదాపు పూర్తికావచ్చాయి. వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు వేయాల్సి ఉందని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. మూడు రోజుల క్రితం నిర్మాణ పనులను ఎమ్మెల్యే కసిరెడ్డి పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి, వంతెనను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

రూ.3.10 కోట్లతో..

మూడేళ్ల క్రితం వంతెన కోసం పీఎంజీఎస్‌వై కింద ప్రభుత్వం రూ.3.10 కోట్లు మంజూరు చేయగా.. అప్పటి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అయితే నిర్మాణ పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్.. మరొకరికి బాధ్యత అప్పగించినట్లు సమాచారం. కారణం ఏమైనప్పటికీ.. పిల్లర్ల దశలో పనులు నిలిచి పోయాయి.

ఇబ్బందులు తీరుతాయి



ఇరు తండాల మధ్య ఉన్న కత్వవాగుపై వంతెన నిర్మాణం పూర్తయితే ఇబ్బందులు తీరుతాయి. బ్రిడ్జికోసం చాలాకాలం ఎదురు చూశాం. నిరసనలు తెలిపాము. ఎట్టకేలకు నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. వచ్చే వానాకాలం నాటికి వినియోగంలోకి తెస్తే బాగుంటుంది.

– నేనావత్ మహిపాల్, శంకరకొండతండా

అనాథ విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం


సభలో ప్రసంగిస్తున్న హెచ్‌జీ గీవర్గీస్

యాచారం: అనాథ విద్యార్థుల సంక్షేమం, వారి ఉన్నత చదువుల కోసమే సెయింట్ గ్రిగోరియస్ బాలగ్రామ్ సంస్థ పని చేస్తుందని ఆ సంస్థ ప్రతినిధి హెచ్‌జీ గీవర్గీస్ మార్ తెలిపారు. ఆదివారం తక్కళ్ల పల్లితండాలోని బాలగ్రామ్ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా సంస్థ వేలాది మంది పేద విద్యార్థులకు ఆశ్రయం కల్పించిదని తెలిపారు. ఉచిత వసతి, మెరుగైన విద్యతో పాటు కంటి పరీక్షలు, చికిత్సలు అందిస్తుందన్నారు. సంస్థ ప్రోత్సాహంతో వేలాది మంది డాక్టర్లు, టీచర్లు, శాస్త్రవేత్తలుగా ఎదిగారని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్ యుహానాన్, యువనాన్ మార్, తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, చర్చి పాస్టర్లు వికార్, థామస్ జాన్, రాచెల్ సిస్టర్, థామస్ కుట్టి రాంబన్, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ సభ్యుడు అంగోత్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సాయం

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన కోసికే జగన్– లక్ష్మమ్మ దంపతుల కుమార్తె రోజా వివాహానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్ నాయక్ చేయూత నందించారు. ఆదివారం రూ.21 వేలతో పాటు, పట్టు చీరను బహూకరించారు. అదే విధంగా మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, నాయకులు లాయక్‌అలీ, నర్సింహ, పాండు, శ్రీను, మహేశ్, జంగయ్య, వెంకటేశ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

సంతకాల సేకరణ

కేశంపేట: స్థానిక సంస్థలో దివ్యాంగులకు నామినేటెడ్ పదవులు ఇచ్చేందుకు చట్టం తీసుకురావాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మండల ఉపాధ్యక్షుడు యాదయ్య అన్నారు. దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో చట్టం సాధనకు లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో దివ్యాంగులు సంతకాల సేకరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదయ్య పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో దివ్యాంగులు 12.02 శాతం మంది ఉన్నారని, స్థానిక సంస్థలో దివ్యాంగులకు నామినేటెడ్ పదవులను ఇచ్చేందుకు చట్టం తీసుకురావాలని ఆయన కోరారు. దివ్యాంగులకు ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు నామినేటెడ్ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. దివ్యాంగులకు నామినేటెడ్ పదవులను ఇవ్వడంతో 26,968 మందకి అవకాశాలు వస్తాయని ఆయన తెలిపారు. ఇలా ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి చర్యలు


షాద్‌నగర్: సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 17వ వార్డులో మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.10లక్షల వ్యయంతో యమ్మి బేకరీ నుంచి హనుమాన్ దేవాలయం వరకు నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పట్టణాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలైన సీసీరోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాటు, మంచినీటి వసతి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తోందన్నారు. గత పాలకులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి తగిన విధంగా నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు విశ్వం, బాబర్‌ఖాన్, సర్వర్‌పాషా, వన్నాడ ప్రకాశ్‌గౌడ్, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, బస్వం, జమ్రుద్‌ఖాన్, అప్పి, షఫీఖాన్, ఖాదీర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సబ్బండ వర్గాల అభివృద్ధి

కేశంపేట: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సబ్బండ వర్గాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎస్‌డీఎఫ్ నిధులతో మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో గ్రంథాలయ భవనం, ఎక్లాస్‌ఖాన్‌పేటలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భూమిపూజ చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని బైర్ఖాన్‌పల్లి గ్రామంలోని గుంటుక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

కార్యకర్తకు నివాళి

మండల పరిధిలోని అల్వాల గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త సత్తయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి రూ.5వేల చొప్పున, బిల్లు నాయక్, బండారి నరేశ్, మద్దూరి మధుసూదన్ రూ.2వేల చొప్పున్న ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్యయాదవ్, శ్రీధర్‌రెడ్డి, పల్లె ఆనంద్‌కుమార్, కరుణాకర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, సురేశ్‌రెడ్డి, తైద పర్వతాలు, కోడూరు రాములు, శివయ్య, గ్యార సురేశ్, అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఇబ్రహీంపట్నం రూరల్: రెండు దశాబ్దాల అనంతరం బాల్య మిత్రులు ఒకే వేదికగా సందడి చేశారు. కేరింతలు కొడుతూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 2002- 03 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు.. ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల రోజులను గుర్తుకు చేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నిర్మాణ రంగంలో అగ్రగామి

భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజినీర్ బద్రి


తాపీ మేస్త్రీలకు బహుమతులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధి

ఇబ్రహీంపట్నం రూరల్: నిర్మాణ రంగంలో తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్ నిలిచిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రి తెలిపారు. ఆదివారం రాత్రి ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి బొంగ్లూర్‌లో సంపద స్టీల్ ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని చెప్పారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు స్లాబ్, కాంక్రీట్ సమయంలో సంస్థ నిపుణులు.. సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని వెల్లడించారు. భారతి సిమెంట్‌కు రూ.20 అధికంగా ఉంటుందన్నారు. డీలర్ దీపక్ రెడ్డి మాట్లాడుతూ.. సంస్థ సర్వీస్ చాలా బాగుంటుందని, నాణ్యతలో సాటిలేదన్నారు. ప్రజలు ఎక్కువగా వినియోగించుకోవాలని కోరారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

మాజీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిరంజన్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు పల్లె గోపాల్ గౌడ్.. తన తండ్రి సుదర్శన్ గౌడ్ స్మారకార్థం ఆదిబట్ల మున్సిపాలిటీ ప్రీమియర్ లీగ్ సీజన్– 8 పేరుతో 45 రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఇరువురు.. విజేతగా నిలిచిన మహాత్మ యూత్ అసోసియేషన్‌కు మొదటి బహుమతిగా రూ.46వేలు నగదుతో పాటు జ్ఞాపిక, ద్వితీయ బహుమతిగా యువ చైతన్య యూత్ అసోసియేషన్‌కు రూ.26 వేలతో పాటు జ్ఞాపికను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఆటవిడుపుగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జంగయ్య, రాజు, కాంగ్రెస్ నాయకులు రజినీకాంత్, పాండు రంగారెడ్డి, సంరెడ్డి మహిపాల్ రెడ్డి, కిరణ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జమ్మరాజు, శ్రీహరిగౌడ్, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి
- మైసమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు


మైసమ్మ సన్నిధిలో వంశీచంద్‌రెడ్డి, నాయకులు

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందుతాయని పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధి మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వంశీని ఆలయ నిర్వాహకులు పూలమాల, శాలువాతో సత్కరించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీలత, ట్రస్టీ శిరోలీ, అర్చక సిబ్బంది, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, బీచ్యానాయక్, హన్మానాయక్, జవహర్‌లాల్, బాలరాజ్, వెంకటేశ్, హీరాసింగ్, రామకృష్ణ, జగన్, నరేందర్, యాదయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి


చైర్మన్ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

మీర్‌పేట: అధిక ఇంటి పన్ను సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం ఫెడరేషన్ ఆఫ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ, పక్కనే ఉన్న బడంగ్‌పేటలో అనుసరిస్తున్న పన్ను విధానాన్ని మీర్‌పేటలో అమలు చేయాలని, వార్షిక అద్దె విలువ ఆధారంగా పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. అధిక ఇంటి పన్ను మీర్‌పేట ప్రజలకు ఆర్థిక భారంగా మారిందని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా పెంచిన ఇంటి పన్నును తగ్గించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఫెడరేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, ప్రతినిధులు వెంకటయ్య, మల్లారెడ్డి, ప్రేమ్‌చందర్‌రెడ్డి, పద్మాచారి, శివానందం, శ్రావణ్, ప్రభాకర్‌రావు, జగాశ్ రెడ్డి, శాంతమూర్తి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మరుగున పడేశారు..


నిరుపయోగంగా శ్రీరాం కాలనీ పీఎఫ్‌టీ టాయిలెట్

'ఆరు బయట మలమూత్ర విసర్జన మంచిది కాదు. బహిరంగ మలమూత్ర విసర్జన మానుకుందాం' అంటూ ప్రభుత్వాలు విస్తృత ప్రచారం చేశాయి. అత్యవసరాలకు రహదారులు, కూడళ్లు తదితర ప్రాంతాల్లో ప్రజా మూత్రశాలలు ఏర్పాటు చేశాయి. కానీ నిర్వహణ మరవడంతో మరుగున పడ్డాయి.

- నిర్వహణలేక.. నిరుపయోగంగా ప్రజా మరుగుదొడ్లు
- ఏడాది తిరగక ముందే తాళాలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో ప్రజా మూత్రశాలల నిర్వహణ అటకెక్కింది. ఎంతో ఆర్భాటంగా మూత్రశాలల నిర్మాణం చేపట్టిన అధికార యంత్రాంగం.. పర్యవేక్షణ మరచింది. ఫలితంగా కొన్ని అపరిశుభ్రతకు నిలయంగా మారగా.. మరికొన్ని కబ్జాల బారిన పడుతున్నాయి. జల్‌పల్లిని ఓడీఎఫ్(బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత పట్టణం)గా ప్రకటించిన నేపథ్యంలో.. ప్రజా మూత్రశాలల నిర్వహణపై మొదట్లో ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా 2017లో మున్సిపాలిటీలో మరుగుదొడ్లు లేని దాదాపు వంద కుటుంబాలను సర్వే ద్వారా గుర్తించి మరుగుదొడ్లు నిర్మించారు. ఇక బాటసారులు, ప్రయాణికుల సౌకర్యార్థం పహాడీషరీఫ్, శ్రీరాం కాలనీ, కొత్తపేటలో పక్కాగా ప్రజా మూత్రశాలలను నిర్మించారు. వీటికి కొనసాగింపుగా 2020వ సంవత్సరంలో షాహిన్ నగర్, జల్‌పల్లి, శ్రీరాం కాలనీ, ఎర్రకుంటలో రూ.లక్షలు వెచ్చించిపీఎఫ్‌టీ (ప్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్) స్వచ్ఛ మూత్రశాలలను నిర్మించారు.

పేరుకే 53..

బాటసారుల అత్యవసరాల నేపథ్యంలో మున్సిపాలిటీ పరధిలో 53 ప్రజా మూత్రశాలలు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు జరిగాయి. వీటిని ప్రధాన కూడళ్లు, బస్టాప్‌లు, శ్మశాన వాటికలు, కూరగాయల మార్కెట్ల సమీపంలో నిర్మించాలని భావించారు. ఇందులో ఏడు బీవోటీ(బిల్ట్ ఆపరేటెడ్ టాయిలెట్)మూత్రశాలలు ఉన్నాయి. వీటిల్లో ఓ వ్యక్తి పర్యవేక్షకుడిగా ఉంటూ, నామమాత్రపు రుసుం వసూలు చేసి, శుభ్రంగా ఉండేలా చూస్తాడు. కానీ ఒక్క బీఓటీ కూడా నిర్మాణం రూపు దాల్చలేదు. వీటితో పాటు మరో 15 సాధారణ టాయిలెట్లు.. పెట్రోల్ పంపుల్లో 12 మూత్రశాలలు, ఫంక్షన్‌హాళ్లలోని నాలుగు మూత్రశాలలను పబ్లిక్ టాయిలెట్లుగా పరిగణిస్తామని ప్రకటించినా అధికారుల పర్యవేక్షణ కొరవడింది.

తాళాలు..

2020 అక్టోబర్ 2 గాంధీ జయంతిని పురస్కరించుకుని జల్‌పల్లి బస్టాప్, శ్రీరాం కాలనీ శ్మశాన వాటిక, షాహిన్‌నగర్‌లోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ వద్ద పీఎఫ్‌టీలను అందుబాటులోకి తెచ్చారు. కానీ నిర్వహణ లోపంతో ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. శ్రీరాం కాలనీలో పక్కాగా నిర్మించిన మూత్రశాల కబ్జా బారిన పడింది. ఇక పహాడీషరీఫ్, కొత్తపేటలో అధికారులు తాళాలు వేశారు. దీంతో అవీ వృథాగా పడున్నాయి. సిబ్బంది కొరత, ఏడాది తిరగక ముందే కమిషనర్లు బదిలీ ఇందుకు కారణంగా కనిపిస్తుంది.



మూతపడిన పహాడీషరీఫ్ మూత్రశాల

పే అండ్ యూజ్ బెస్ట్



గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఆవిర్భవించి పదేళ్లు కావొస్తుంది. కానీ జల్‌పల్లిలో మూత్రశాలల నిర్మాణం జరగడం లేదు. మున్సిపాలిటీకి కేంద్రంగా ఉన్న ఈ గ్రామంలో ప్రజలకు సరిపడా స్థాయిలో పే అండ్ యూజ్ టాయిలెట్ నిర్మిస్తే బాగుంటుంది. అధికార యంత్రాంగం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.

– మంద ప్రశాంత్, జల్‌పల్లి